సాక్షి నిర్మల్
మంగళవారం । 2 । మే । 2023



కేజీబీవీలకు సెలవుల్లేనట్లే..!?
కేజీబీవీ టీచర్లు వేసవిలోనూ బడులకు రావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మే 31 వరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకటించారు. 8లో▸



మర్డర్ మిస్టరీ వీడేనా..! 8లో▸
ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సీతాగోంది సమీపంలోని గర్కంపేట్ వద్ద జరిగిన జంట హత్యల కేసులో పోలీసులు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు.

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 32.2 /22.4
ఆకాశం మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం చల్లగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్



మాట్లాడుతున్న కర్ణకుమార్

నిర్మల్‌టౌన్: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.కర్ణ కుమార్ అన్నారు. మేడేను పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని న్యాయపరమైన చట్టాలను వివరించారు. సైబర్ చట్టాలు, యాసిడ్ దాడులు, బాల్య వివాహాలు, గృహహింస చట్టం, నిర్వహణ చట్టం, యాసిడ్ దాడుల న్యాయ సేవలపై అందరికీ పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి అజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, న్యాయవాదులు రాజలింగం, లింగయ్య, మహేందర్, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపుకార్డులు



గుర్తింపు కార్డులు అందజేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవద్ధుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి సోమవారం తన ఛాంబర్‌లో ఐదుగురు ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపుకార్డులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీని ద్వారా ట్రాన్స్‌జెండర్లు ఆర్థిక పునరావాస పథకాలకు అర్హులవుతారన్నారు. సమాజంలో ఎలాంటి వివక్షతకు గురికాకుండా స్వయం శక్తితో జీవనోపాధి కార్యక్రమాలు పెంపొందించుకోవాలన్నారు. అర్హులైన ట్రాన్స్‌జెండర్లు గుర్తింపుకార్డులకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విజయలక్ష్మి , జూనియర్ అసిస్టెంట్లు శ్రీరామమూర్తి, స్వాతి, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

అభ్యంతరాల గడువు పొడగింపు

నిర్మల్‌చైన్‌గేట్: నేషనల్ హెల్త్ మిషన్ కింద జిల్లా కేంద్రంలోని డైస్ కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో వివిధ కేటగిరీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేసిన ప్రభుత్వం అభ్యంతరాల గడువు ఈ నెల 3 వరకు పొడగించినట్లు డీఎంహెచ్‌వో ధనరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్టు, డీఎంహెచ్‌వో కార్యాలయంలో, nirmal.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 3న సాయంత్రం ఐదు గంటల లోపు సంబంధిత ధ్రువపత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

6న టీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

నిర్మల్‌రూరల్: ఈ నెల 6న టీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ గంగాశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 17 కేంద్రాలలో నిర్వహించనున్న పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 4,049 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లను http://tsrjcdc.cgg.gov.inవెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 040-24734899 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కృష్ణమోహన్‌గౌడ్‌కు శ్రమశక్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న కృష్ణమోహన్‌గౌడ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 3194 జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్ గౌడ్ శ్రమశక్తి అవార్డు అందుకున్నారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాణీ కుముదిని చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

తూకం.. ఇష్టారాజ్యం



ఎలక్ట్రానిక్ కాంటాపై తూకం వేస్తున్న మక్కలు

- జిల్లాలో కనిపించని తూనికలు, కొలతల శాఖ తనిఖీలు
- మోసాలపై వినియోగదారులకు అవగాహన కరువు
- అక్రమార్కులకు వరంగా అధికారుల తీరు

భైంసాటౌన్(ముధోల్): తూకాల్లో మోసాలపై తనిఖీలు నిర్వహిస్తూ వినియోగదారులు మోసపోకుండా అవగాహన కల్పించాల్సిన తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఇన్‌చార్జి బాధ్యతల పేరిట జిల్లా వైపు చూసిన పాపాన పోవడం లేదు. తూతూమంత్రంగా స్టాంపింగ్ చేస్తూ మమ అనిపిస్తున్నారు. పాల్పడే మోసాలపై పర్యవేక్షణ లేక వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా మంది స్టాంపింగ్ లేని కాంటాలు వినియోగిస్తున్నారు. దీంతో స్టాంపింగ్ రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రాకుండా పోతోంది. ముఖ్యంగా తూకాల్లో మోసాలపై వినియోగదారులకు అవగాహన లేక, మోసపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వినియోగదారులు కోరుతున్నారు.

మోసాలపై అవగాహన కరువు...
రైతులు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలను మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యాపారులు రైతుల వద్దకే వచ్చి ఎలక్ట్రానిక్ కాంటాలతో పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఎలక్ట్రానిక్ కాంటాల్లో మోసాలకు ఆస్కారం లేకపోలేదు. ఇలాంటి మోసాలపై సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉండగా ఆదిశగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు. కొందరు వ్యాపారులు తూకాలు వేసేటప్పుడు స్టాంపింగ్ లేని కాంటాలు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు మోసపోకుండా తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఇన్‌చార్జి అధికారితోనే సరి..
జిల్లాలో తూనికలు, కొలతల శాఖకు దాదాపు రెండేళ్లుగా ఇన్‌చార్జి అధికారితోనే నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం జిల్లాకు ఇన్‌చార్జిగా కొనసాగుతున్న అధికారి, హైదరాబాద్‌తో పాటు కరీంనగర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జిల్లాకు రెగ్యులర్ అధికారి లేక క్షేత్రస్థాయిలో తనిఖీలు జరుపడం లేదన్న విమర్శలున్నాయి. దీంతోపాటు శాఖకు సరైన ఆదాయం చేకూరడం లేదు. రెగ్యులర్ అధికారిని నియమించి, తూనికలు, కొలతల్లో మోసాలకు ఆస్కారం లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

తనిఖీలు చేపట్టాలి
ప్రైవేట్ వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాంటాలు తెచ్చి మక్కలు కొనుగోలు చేస్తున్నారు. కాంటాల్లో మోసాలపై మాకు అవగాహన లేదు. సంబంధిత అధికారులు తనిఖీలు చేయాలి. మాలాంటి వారికి అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుంది.
– శివాజీ, రైతు, సిద్దూర్

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం
తూకాల్లో మోసాలపై వినియోగదారులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. కాంటాపై అనుమానం వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి. తూకంలో అవకతవకలకు పాల్పడితే వారి వివరాలు, రశీదుతో సహా తెలియజేయాలి.
– భూలక్ష్మి, తూనికలు, కొలతల శాఖ ఇన్‌చార్జి అధికారి, నిర్మల్

కార్యాలయం దాటరు.. తనిఖీలు చేయరు..
వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడకుండా, వినియోగదారులకు నాణ్యమైన సరుకులు, సేవలు అందేలా చూడాల్సిన సంబంధిత అధికారులు కార్యాలయం దాటడం లేదన్న విమర్శలున్నాయి. స్టాంపింగ్ రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంపై దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇన్‌చార్జి బాధ్యతల పేరిట అధికారులు జిల్లాను పట్టించుకున్న పాపాన పోవడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని నిర్మల్, భైంసా ప్రధాన పట్టణాల్లో వేల సంఖ్యలో కిరాణ షాపులు, ఇతర దుకాణాలుండగా ప్రతీ దుకాణంలో ఎలక్ట్రానిక్ కాంటాలు ఉన్నాయి. జిన్నింగ్ మిల్లులు, మార్కెట్ యార్డుల్లో ఎలక్ట్రానిక్ కాంటాలపై పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తుంటారు. రైతులతో పాటు, వస్తువుల వినియోగదారులు తూకాల్లో మోసపోకుండా చూడాల్సిన అధికారులు దాదాపు రెండేళ్లుగా తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు.

సారూ... మా గోడు వినండి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

- కలెక్టరేట్‌లో ప్రజావాణి
- పురుగుల మందు డబ్బాతో వచ్చిన బాధితుడు

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వివిధ సమస్యలపై 16 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు వినతులను స్వీకరించారు. లోకేశ్వరం మండలం కనకాపూర్ నుంచి ఆష్టా వరకు గతేడాది 1.5 కోట్ల పంచాయతీ రాజ్ నిధులతో వేసిన బీటీ రోడ్డు పూర్తిగా చెడిపోయిందని, అట్టిరోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతూ ఆష్టా గ్రామస్తులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని గొల్లపేట కాలనీకి చెందిన బొమ్మెన లక్ష్మీబాయి తనకు డబుల్ బెడ్ రూమ్ ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

సమస్య పరిష్కరించకుంటే ఆత్మహత్యే శరణ్యం



మందుడబ్బాతో వచ్చిన బాధితుడు

తమ సమస్య పరిష్కరించాలని, లేదంటే పురుగుల మందు తాగుతానని నిర్మల్ రూరల్ మండలం సిద్దాపూర్‌కు చెందిన బైకాస్ మల్లయ్య పురుగుల మందు డబ్బాతో ప్రజావాణికి వచ్చాడు. గ్రామంలోని సర్వేనంబర్ 295లో 30 గుంటల భూమి బైకాస్ మల్లయ్య, చిన్నయ్య పేరు మీద డాక్యుమెంట్స్ కలిగి ఉన్నామని, ఇట్టి భూమిని ఇతరులు తమ పేరు మీదికి మార్చుకోవాలని మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్‌కు వివరించాడు. తహసీల్దార్ వద్దకు వెళ్తే తనచేతిలో ఏమీలేదని, కోర్టుకు వెళ్లమని సలహా ఇచ్చినట్లు తెలిపారు. స్పందించి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ పాదాలపై పడ్డాడు. లేదంటే పురుగుల మందు తాగి చనిపోవడమే మాకు శరణ్యమన్నారు. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





వారసంతలో సమస్యల చింత..!

భైంసాటౌన్(ముధోల్): భైంసాలో ప్రతీ సోమవారం జరిగే వారసంతకు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు, మహారాష్ట్రకు చెందిన రైతులు సైతం కూరగాయలు విక్రయించేందుకు వస్తారు. టిప్పుసుల్తాన్ చౌక్ నుంచి మిర్చిమార్కెట్ యార్డు వరకు రైతులు కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేస్తారు. సంతలో ఎలాంటి వసతులు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి తోడు విద్యుత్ సరఫరా లేకపోవడంతో చీకట్లో అవస్థలు పడ్డారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమపూజ



ఖానాపూర్: వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆలయంలో కుంకుమపూజ నిర్వహించారు. అర్చకుడు అభిషేక్ శర్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్, కిషన్, లక్ష్మీనారాయణ, సతీష్, మానస, స్రవంతి, వరలక్ష్మి, శ్వేత, మాధవి, వాసవి, రాజేశ్, బుచ్చన్న, నీలిమ, పద్మ, సరిత, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



క్యారం ఆడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నర్సాపూర్(జి): విద్యార్థులు సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 వరకు క్యాంపు ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు వివిధ రకాల క్రీడలు, 9 నుంచి 10 గంటల వరకు విద్యాశాఖ అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం క్యారం, వాలీబాల్, షటిల్, టెన్నీకాయిట్ ఆటలు ఆడారు. కంటివెలుగు శిబిరాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారి క్రాంతి కుమార్, డీఏవో అంజిప్రసాద్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, పీడీ దర్శనం దేవేందర్, ఆర్బీఎస్ నాయకులు కొండ్ర రమేశ్, గోపిడి గంగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం
నిర్మల్‌రూరల్: ఆటపాటలతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముజ్గి ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, క్యాంపు ప్రత్యేక అధికారి నర్సింహారెడ్డి, సర్పంచ్ రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే
ఖానాపూర్: ప్రభుత్వం చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపు శిబిరాన్ని అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ కలీల్, కమిషనర్ రత్నాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ రామునాయక్, నాయకులు పుప్పాల శంకర్, వెంకాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు
జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు తాము సమ్మర్ క్యాంపునకు హాజరైనప్పటికీ స్థానిక అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని పెటా సంఘం జిల్లా అధ్యక్షుడు బుక్యా రమేశ్ అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. స్టేజిపైకి పిలవకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న



ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: కార్మికుల హక్కుల సాధనకోసం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న అన్నారు. మే డేను పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భగత్ సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బక్కన్న, ఆర్ రామలక్ష్మణ్, కట్ల లక్ష్మి, ఎస్ గంగన్న, ఎండీ గఫూర్, మహిమూద్, ఎస్ లక్ష్మి, కిషన్, పోశెట్టి, ఐలయ్య, గంగమణి, తదితరులు పాల్గొన్నారు.

మే డే స్ఫూర్తితో పోరాడాలి
మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాస చారి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో ఆర్ఎంవో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద(నిర్మల్): అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని చామన్‌పెల్లి సమీపంలో వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలు చేతికి అందే సమయంలో అకాల వర్షానికి దెబ్బతినడంతో అన్నదాతలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తడిసిన వరి ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. వర్షానికి నువ్వు, వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని, వ్యవసాయ శాఖ పంటనష్టం అంచనావేసి పరిహారం అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని రైతులను కోరారు. ఆయన వెంట సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, బీజేపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను లెక్కలోకి తీసుకోం

- బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే
- పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మర్రి శశిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: రాబోయే ఎన్నికల్లో బీజేపీ టీఆర్‌ఎస్‌తోనే పోటీ పడుతుందని, కాంగ్రెస్‌ను లెక్కలోకి తీసుకోదని బీజేపీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బాలాజీ ఇన్ హోటల్‌లో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ పదాధికారుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంపన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణను ఇప్పుడు లక్షల కోట్ల అప్పులపాలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో పేపర్ లీకేజీ పద్ధతి ప్రకారం జరిగిందని, ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు బాధ్యత వహించాలన్నారు. రానున్న ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాలను కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పాత, కొత్త వారిని కలుపుకుపోవాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ భూమయ్య, పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, పడిపిల్లి గంగాధర్, సామ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు డాక్టర్ మల్లికార్జునరెడ్డి, రామారావు పటేల్, మోహన్‌రావు పటేల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాష్ లడ్డ, జిల్లా ఉపాధ్యక్షులు కమల్నయన్, అలివేలు, భూషణ్, శ్రీనివాస్, కార్యదర్శులు కోరిపల్లి శ్రవణ్ రెడ్డి, మిట్టపల్లి రాజేందర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో ప్రొటోకాల్ లొల్లి
పదాధికారుల సమావేశంలో తనను మాట్లాడమని పిలవకపోవడంపై మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అసహనం వ్యక్తం చేశారు. జిల్లా నాయకులకు మాత్రమే మాట్లాడే అవకాశం కల్పించామని చెప్పడంతో తాను జిల్లా నాయకుడిని కాదా? అని అసంతృప్తి వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీలకు సెలవులివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు మే మాసంలో సెలవులు ఇవ్వాలని కోరుతూ సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 14 ప్రకారం నెలరోజులు సెలవులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మెన సురేష్, ఏ. రాజమణి, శైలజ, శశికళ, దేవిక, లావణ్య, భాగ్య, నరసమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోంగార్డుకు మెమో

భైంసాటౌన్: బాసర దేవస్థానంలో హోంగార్డుగా పనిచేస్తున్న దిలీప్‌కుమార్‌కు మెమో జారీ చేసినట్లు ఆలయ ఈవో విజయరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు రుజువైందని, ఈ మేరకు మెమో ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, ఇప్పటివరకు సంజాయిషీ రాలేని కారణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కిక్‌బాక్సింగ్ విజేతగా మంచిర్యాల జిల్లా



మెమెంటో అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల విజేతగా మంచిర్యాల జిల్లా గెలుపొందింది. రాష్ట్రస్థాయి నుంచి వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొనగా, విజేతగా మంచిర్యాల జిల్లా, రన్నర్‌గా నిర్మల్ జిల్లా, మూడో స్థానంలో జగిత్యాల జిల్లా గెలుపొందింది. విజేతలకు మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, కిక్ బాక్సింగ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీలత, రాష్ట్ర కార్యదర్శి మైపాల్‌లు మెమెంటోలు అందజేశారు.

బాసరవాసికి దళితరత్న అవార్డు

భైంసాటౌన్: బాసర మండలం ఓని గ్రామానికి చెందిన గౌతమ్‌కు దళితరత్న అవార్డు వరించింది. సామాజిక సేవ, కళా రంగంలో నైపుణ్యం కలిగినవారికి రాష్ట్రప్రభుత్వం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అవార్డులు ప్రకటించింది. ఈ మేరకు గతనెల 30న నిజామాబాద్ జిల్లా బోధన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్పీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆకునూరి మురళి, జీవీ రాజు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. అంబేద్కర్ జీవితచరిత్ర, శివాజీ, సావిత్రిబాయి పూలే జీవితచరిత్రపై పాటలు పాడడంతోపాటు కళానైపుణ్యంతో చేసిన సామాజిక సేవకుగాను అవార్డు వరించినట్లు గౌతమ్ పేర్కొన్నారు.

7న ఆదివాసీ భారత మహా ద్వితీయ జాతీయ సమావేశం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఈనెల 7న నిర్వహించే ఆదివాసీ భారత మహా ద్వితీయ జాతీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గేడం మనోహర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీఎం సమావేశ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఏబీఎం ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ఆదివాసీల సమస్యలు, ఇతర చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్, ఏబీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం వినోద్, పార్డి అనిల్, సంస్కృతిక కార్యదర్శి గేడం మనోజ్, మహిళా నాయకురాలు ఆత్రం సుశీల తదితరులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

నర్సాపూర్(జి): మండలంలోని బామిని(బి) శివారులోని రామాయికుంట చెరువు వద్ద సోమవారం సాయంత్రం స్పెషల్ పోలీసు బృందం పేకాటస్థావరంపై దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.5200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాకాల గీత తెలిపారు.

అకాల వర్షం.. అపార నష్టం



హాజీపూర్ మండలం టీకానపల్లిలో తడిసిన ధాన్యం ఆరబోస్తున్న దుర్గం పుష్పలత

చిత్తాపూర్‌లో నేలరాలిన మామిడి కాయలు



కొనుగోలు కేంద్రాల్లో వేరుకుపోయిన ధాన్యం, తడిసిన ధాన్యం



నెన్నెల: గంగారాంలో నేలకొరిగిన వరిపంట



కోటపల్లి మండలం ఎసన్‌వాయిలో..



కొండపల్లిలో నేలకొరిగిన వరి పంట

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు..రైతులకు అపార నష్టాన్ని మిగుల్చుతున్నాయి. గతమూడు రోజులుగా ఈదురుగాలులతో కురుస్తున్న భారీ వర్షాలకు వరి, మొక్కజొన్న, జొన్న, నువ్వులు, శనగ, పెసర, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికందిన మామిడికాయలు రాలగా, వరి పంటలు నేలకొరిగింది. కళ్లముందే పంటలు నేలపాలు కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల రోడ్లపైకి ధాన్యం కొట్టుకొచ్చింది. ఇప్పటివరకు వేల ఎకరాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. - సాక్షి నెట్‌వర్క్



ఆదిలాబాద్ జిల్లాలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



హాజీపూర్ మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన ధాన్యం



బెల్లంపల్లిలో విద్యుత్ తీగలపై విరిగిపడ్డ చెట్లు

మర్డర్ మిస్టరీ వీడేనా..!



హత్యకు గురైన అశ్వినితో భర్త రమేశ్



చిన్నారులు లోకేష్, సునాక్షి

- ముమ్మరంగా దర్యాప్తు
- మిస్టరీ కొలిక్కి వచ్చినట్లు సమాచారం

గుడిహత్నూర్: సీతాగోంది సమీపంలోని గర్కంపేట్ వద్ద జరిగిన జంట హత్యల కేసులో పురోగతి కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో భుక్తాపూర్‌కు చెందిన మహమ్మద్ రహమాన్ (20), సుందరయ్యనగర్‌కు చెందిన వివాహిత సోన్‌కాంబ్లే అశ్విని (28) హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యోదంతం జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. ఆదివారం మృతదేహాలను గుర్తించిన పోలీసులు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలాన్ని జల్లెడపట్టి ఆధారాలు సేకరించారు. ఇరు మృతదేహాలకు సంఘటనా స్థలంలో స్థానిక సర్పంచ్ ధనలక్ష్మి సమక్షంలో పంచనామా నిర్వహించి రిమ్స్‌కు తరలించారు. కాగా, ఆదివారం రహమాన్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. కాని అశ్విని మృతదేహానికి సోమవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అందజేయగా వారు అంత్యక్రియలు పూర్తి చేశారు.

కుటుంబ సభ్యుల పాత్రపై ఆరా..

వివాహేతర సంబంధం నేపథ్యంలో హతుల సెల్‌ఫోన్ డాటాతో పాటు దొరికిన ఆధారాలను క్రోడీకరించి పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. హత్యోదంతం బయటపడ్డ రోజు సంఘటనా స్థలానికి అశ్విని కుటుంబీకులు రాకపోవడం పలు అనుమానాలు రేకెత్తించింది. దీంతో ఈ జంట హత్యల్లో అశ్విని కుటుంబ సభ్యుల పాత్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అశ్విని భర్త, అశ్విని తమ్ముడిని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. హత్యకు గురైన ఇరువురిని అత్యంత దారుణంగా హత్య చేసినట్లు మృతదేహాలపై ఉన్న గాయాలున్నాయి. అయితే ఈ జంట హత్య చేయడానికి ఎంత మంది పాలుపంచుకున్నారు? అసలు హతులు గర్కంపేటకు సమీపంలో ఉన్నట్లు సమాచారం ఎవరు అందించారు? హత్యకు ముందు వీరి మధ్య వాగ్వాదా లు జరిగాయా? లేదంటే ముందస్తుగా హత్య చేయాలని పథకం ప్రకారం వీరిని వెంబడించి ఈ దారుణగానికి పాల్పడ్డారా? అనే విషయమై జిల్లా వాసులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. కాగా మంగళవారం ఈ హత్యోదంతంపై పోలీసు ఉన్నతాధికారులు వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే హత్యకు గురైన అశ్విని, హత్యారోపణ ఎదుర్కొంటున్న భర్త రమేశ్ జైలుకు వెళ్తే చిన్నారులు లోకేష్ (8) సునాక్షి (4) అనాథలుగా మిగిలిపోనున్నారు.

టూరిస్ట్ బస్ సీజ్



నకిలీ నంబర్‌తో టూరిస్ట్ బస్సు

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ నంబర్‌తో వెళ్తున్న టూరిస్ట్ బస్సును సీజ్ చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం హైదరాబాద్ నుంచి వారణాసికి టీఎస్31టీఏ1577 నంబర్ గల టూరిస్ట్ బస్సు నకిలీ నంబర్‌తో వెళ్తుంది. సమాచారం అందుకుని చెక్‌పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. తెల్లవారుజాము ఆదిలాబాద్ చెక్‌పోస్టు వద్ద సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. బస్సును ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోకు తరలించారు. ముందుగానే పిప్పర్‌వాడ టోల్‌గేట్ వద్ద సిబ్బందిని ఉంచాలని ఆదేశించారు. డ్రైవర్ చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని ఆపకుండా వెళ్లడంతో ఎంవీఐ రాహుల్ కుమార్, ఏఎంవీఐ మధు వెంబడించారు. టోల్‌గేట్ సమీపంలో బస్సును పట్టుకొని చెక్‌పోస్టుకు తరలించారు. పత్రాలను పరిశీలించడంతో పాటు వాహనంపై ఉన్న చేజిస్ నంబర్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌లో ఉన్న నంబర్‌తో సరిపోకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసినట్లు డీటీసీ వివరించారు.

గోదావరిలోకి దూకి మహిళ ఆత్మహత్య



అలేఖ్య మృతదేహం


సోన్: సోన్ సమీపంలోని గోదావరిలో దూకి సోమవారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడకు చెందిన మెంగ అలేఖ్య(32) భర్తతో విడాకులు తీసుకుంది. తల్లితో కలిసి ఉంటుంది. మొబైల్ విషయంపై తల్లితో గొడవ జరగడంతో మనస్తాపం చెంది సోన్‌లోని జాతీయ రహదారి పాత బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకింది. గమనించిన పలువురు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రవీందర్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేజీబీవీలకు సెలవుల్లేనట్లే..!?

- ప్రతిరోజు స్కూల్‌కు రావాలని ఆదేశాలు
- విద్యాశాఖ నిర్ణయాలపై టీచర్ల అసంతృప్తి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

జిల్లా	కేజీబీవీలు	టీచింగ్	నాన్‌టీచింగ్
మంచిర్యాల	18	193	133
ఆదిలాబాద్	17	230	231
నిర్మల్	18	187	206
కుమురం భీం	15	165	126



కేజీబీవీల్లో టీచర్లు, నాన్‌టీచర్లపై జిల్లాల వారీగా ఏప్రిల్ 28న బయోమెట్రిక్ అటెండెన్స్ గ్రాఫ్

మంచిర్యాలఅర్బన్: రాష్ట్రప్రభుత్వం ఏప్రిల్ 25 నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. ఇదివరకు సెలవుల్లో విద్యాసంస్థలు అడ్మిషన్లు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇంతలోనే నిబంధనలు తుంగలో తొక్కి పేద, వెనుకబడిన మధ్యలో బడి మానేసినా బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీల) టీచర్లను బడులకు రావాలని ఆదేశాలు జారీపై గందరగోళం నెలకొంది. మునుపెన్నడూలేని విధంగా ఏ పాఠశాలల యాజమాన్యాల్లో లేని ఆంక్షలు కేజీబీవీలో విధులు నిర్వహించే నాన్‌టీచింగ్, నాన్‌టీచింగ్‌పై విధించడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. పిల్లలందరూ ఇంటిపట్టున ఉంటే టీచర్లంతా బడికి వెళ్లాలనే హుకుంపై పెదవి విరుస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులను పర్మినెంట్ ప్రక్రియ చేపట్టగా..ఇంకోవైపు కేజీబీవీల్లో కాంట్రాక్టు విధులు నిర్వహిస్తున్న టీచర్ల క్రమబద్ధీకరణ మాటదెవుడెరుగు వేసవి సెలవులు అమలు చేయకపోవడంపై టీచర్లు వాపోతున్నారు.

బడికి వెళ్లాల్సిందే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు లేకపోయినా టీచర్లు బడికి వెళ్లి విధులు నిర్వహించాలని జూమ్ మీటింగ్ ద్వారా సూచించారు. టీచర్లు మే 31 వరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ చేయాలని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. వీరికి మూడు రకాల విధులు కేటాయించారు. స్కూల్లో ఉంటూ అడ్మిషన్లు చేపట్టడం.. చుట్టుపక్కలా గ్రామాలకు వెళ్లి అడ్మిషన్ల కోసం గ్రామాలకు వెళ్లి ప్రచారం చేపట్టడం .. ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలని సూచించారు. ఇదంతా బాగానే ఉన్నా ప్రతిక్లాస్‌లో 40 మంది చొప్పున విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఆరో తరగతిలో 40 మందికి అవకాశం ఉంటుంది. మిగిలిన క్లాస్‌లో ఎవరైనా వెళ్లిపోతే ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంటుంది. విద్యాసంస్థల పున:ప్రారంభం కాకముందే నిర్దేశిత లక్ష్యం 40 మంది అడ్మిషన్లు పూర్తయి సీట్లు దొరకని పరిస్థితి ఉంటుంది. ఇప్పుడు కొత్తగా గ్రామాలకు వెళ్లి క్యాన్వసింగ్ చేయడం దేనికో అధికారులకు తెలియాలి. ఆన్‌లైన్ క్లాసులు ఇంటిపట్టున ఉండి కూడా నిర్వహించవచ్చని టీచర్లు గుర్తుచేస్తున్నారు. బడులకు ఒకరిద్దరూ వెళ్తే సరిపోతుందని పూర్తిస్థాయిలో టీచర్లు వెళ్లాల్సిన అవసరం లేదనేది సంఘాల అభిప్రాయపడుతున్నాయి. నాన్‌టీచింగ్ సిబ్బంది పోపు డబ్బాలు క్లీనింగ్, ప్రాంగణాలు శుభ్రం చేయడం, కిచెన్ గార్డెన్‌కు ఏర్పాట్లు చేసుకోవాలనే చెప్పడం చర్చానీయంశంగా మారింది. అకౌంట్స్ రిపోర్టులు నివేదించడం.. ఏఎన్‌ఎంలు తప్పనిసరిగా రావాలని సూచించడంపై ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సాధారణంగా ఇవన్నీ రోజు వారీ కార్యక్రమాలు కాగా ప్రత్యేకంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అంటూ పిల్లలు లేకుండా బడులు తెరవాలనే విద్యాశాఖ వింత నిర్ణయాలు టీచర్లు, సంఘాలు తప్పుబడుతున్నారు. ఎప్పటిలాగే కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచర్లు, నాన్‌టీచింగ్‌కు సెలవులు అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

సెలవుల్లో విధులు సరికాదు

కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను వేసవి సెలవుల్లో పనిచేయాలనడం సరికాదు. ఉద్యోగులకు సెలవులు అమలు చేయాలి. సెలవుల్లో విధులు నిర్వహించాలనే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి.
– బగ్గని రవికుమార్, తపస్ ప్రధాన కార్యదర్శి, మంచిర్యాల

ఉన్నతాధికారుల ఆదేశాలతో..

ఉన్నతాధికారుల ఆదేశానుసారం కేజీబీవీల్లో విధులు నిర్వహించే టీచర్లు తప్పనిసరిగా బడికి వెళ్లాలి. యాక్షన్ ప్లాన్ తయారు చేయడం..బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలి.
– పద్మజ, సెక్టోరల్ అధికారి, మంచిర్యాల

'సమరశీల పోరాటాలకు సిద్ధం కండి'

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ వ్యతిరేక విధానాలపై అవలంబిస్తున్న తీరును ఖండిస్తూ సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలో గల ఆదివాసీ భవనంలో సోమవారం ఆదివాసీ సేన రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కవ్వాల్ టైగర్ జోన్, ఓపెన్‌కాస్ట్, సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్, ఇతర అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసాలు నిదర్శంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని సహజ వనరులను దోపిడీ చేసి బహుళజాతి సంస్థలకు కట్టబెడుతున్నాయని ఆరోపించారు. సమావేశంలో సాయిబాబు, జంగు పటేల్, వెంకట్, అనిల్ కుమార్, తిరుపతి, విశ్వనాథ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో భీంరావు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: అర్జీలు త్వరగా పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి వారు అర్జీలు స్వీకరించారు. ఓఎస్డీ క్రిష్టయ్య, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి కొమురం బాలు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

- ఉట్నూర్ మండలం గంగాపూర్‌లో రోడ్డు, బ్రిడ్జి మంజూరు చేయాలని, భోపాల్ పేట మండలం సిర్పూర్(టి) గ్రామానికి చెందిన సిడాం వెంకటేశ్ భూమి ఇప్పించాలని గ్రామస్తులు అర్జీలు అందజేశారు.
- నర్సింగ్ ఉద్యోగం కల్పించాలని భీంపూర్ మండలం గుంజాలకు చెందిన ఆత్రం రోజా కోరాడు.
- తనకు వైద్య చికిత్స నిమిత్తం ఆర్థికసాయం అందించాలని జైనూర్ మండలం కొండపటార్‌కు చెందిన అయ్యుబాయి విన్నవించారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన సోమవారం ఆదిలాబాద్‌రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై నాగనాథ్ కథనం ప్రకారం..వివాహితకు 2017లో మహారాష్ట్రలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తితో పెళ్లి జరిగింది. నెలరోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో ఆమె పుట్టింటికి వచ్చింది. కాగా ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.